

# సంస్కృతి

## రామచంద్రమౌళి

క్లిక్....

క్లిక్....క్లిక్.

ఫ్లాష్ మెరుపులు గదినిండా మిలమిలా మెరిసి మాయమై....

"స్మైల్.... ఎ లిటిల్.... కొద్దిగా నవ్వాలి."

నవ్విందామె.

నవ్వుతూనే ఉందామె.

కెమెరాలు కళ్ళు తెరుస్తున్నాయి. క్లిక్....క్లిక్....ఒకటి....రెండు....ఐదు.

గది నిండా నిశ్శబ్దం.

క్లిక్‌ల చప్పుడు....మెరుపుల చప్పుడు .... బయట కురుస్తున్న వర్షం చప్పుడు.

వర్షం వాసన.

గదిలో ఐదుగురు మగ జంతువుల వాసన.

నడుమ ఓ స్త్రీ.... యువతి వాసన,

అంతా వెరసి, కళాకారుల.... కళా వాసన.

ఒట్టి చూపులు .... చూపులు మాట్లాడుతూ,

"మీరు ఆ జాకెట్టు, బ్రా తీసేస్తారా!"

ఆమె కనురెప్పలను చటుక్కున లేబట్టి, చూపులతో ఆ ఐదుగురి శరీరాలను కసిగా కాల్చినంత పనిచేయబోయి... తమాయించుకుని ఒట్టి అర్ధశూన్యంగా పరిసరాలను పరికించి,

తెరచిఉన్న కిటికీ రెక్కలను మూసి జాకెట్టు హుక్‌లను తీయడం మొదలెట్టి-

మళ్ళీ చూపులే,

కెమేరాలను కళ్ళకు అడ్డంపెట్టుకుని... ఆరిచే చూపులు.... ఆకలి చూపులు,

వన్....టు.... త్రీ

హుక్స్ ఐపోయి....జాకెట్టు విడిచేసి ....బ్రా హుక్....ఫట్,

హాఫ్ నేకెడ్ – నగ్న స్తనాలు.... నగ్నమైన వీపు .... నగ్నమైన హృదయం.

"చేతులు పైకెత్తి .. ముఖాన్ని యిటు వేపు తిప్పుతారా!"

"...........…"

క్లిక్....,

మెరుపు–

క్లిక్....మెరుపు,

కానన్–షాట్ .... హాట్‌షాట్ .... షాట్....యాషికా....షాట్....ఫ్లాష్... మెరుపు....మెరుపు లామె శరీరాన్ని తినేస్తున్నాయి.

"టక్....యిటు"

క్లిక్–

"నవ్వు.... ఎ లిటిల్ స్మైల్."

నవ్వింది.

వర్షం కురుస్తోంది.... బయట.

వర్షం కురుస్తోంది కళ్ళలో....

ఆమె కళ్ళలో.... గుండెలో నుంచి వర్షం.... కన్నీళ్ళ వర్షం.

బయటికి కనిపించని మౌనవర్షం.... నవ్వుల చాటున వెక్కివెక్కిపడే, ఎగిరెగిరిపడే దుఃఖపు తుంపర–

సిగరెట్టు పొగలు మేఘాల్లా లేస్తున్నాయి!

"కిర్‌ర్‌ర్....ర్... ర్"

కెమేరాల్లో ఫిల్మ్ తిరుగుతోంది.

ఫోటోగ్రాఫిక్ కాంపిటేషన్స్‌లో పిలిచే .... ఎలుగెత్తి పిలిచే బంగారు పతకం కళాకారుల కళ్ళముందు కదులుతోంది.

క్రొత్త కోణాలు.... స్పష్టత....సహజసిద్ధమైన రూపురేఖలు– నిపుణత.

చేతుల వ్రేళ్ళు నాబ్స్‌పై బిగుసుకుంటున్నాయి.

"రెడీ.... రెడీ...."

స్తనాల క్రిందనుండి....,

పెదవులు.... కళ్ళు.... కళ్ళలో సముద్రాలు.,

కోణాల శోధన

క్లిక్....క్లిక్

"మీరు కొత్త వెనక్కి వాలుతారా.."

"...........…"



"ఆ....అలా....ఇంకాస్త....వెనక్కి ....ఓ....ఓకే"

క్లిక్... క్లిక్.

"థాంక్యూ...."–"ఎక్సలెంట్ పోజ్"

నవ్వు.

"మీ సహకారంవల్ల మాలో ఎవరో ఒకరు గోల్డుమెడల్ తెస్తారీసారి."

నవ్వు....

ఏ భావమూ లేని, ఏ అర్థమూ రాని ఒట్టి ఎడారిలాంటి నవ్వు.

ఎక్కడో ఓ ఉరుము ఉరిమింది.... పిడుగు పడినట్టుంది.

చప్పుడు .... చప్పుడు .... ఉరుముల చప్పుడు.... పిడుగు పడుతున్న చప్పుడు.

"మీరు...."

ఉలిక్కిపడ్డ చూపు.

"మీరు ఆ చీర...."

"... ........ ...." ఆమె రెప్పలు, గుండెలు తడబడుతున్నాయి.

ఎక్కడో లయ తప్పుతోంది.

"మీరు ఆ చీరను కూడా విప్పుతారా"

"... .... ...."

"లంగా కూడా"

"... .... ...."

"ఐ మీన్ నగ్నంగా,"

"... .... ...." వర్షం .... వర్షం.... వర్షం. ఉరుములతో కూడిన వర్షం.

చీర కుచ్చెళ్ళు జారాయి.

చేతులు లంగా నాడాలను ముడి విప్ప దీస్తూ....

చీర జారి....లంగా జారి.,

శరీరం....వంపులు....వయసులు.... నిగనిగలు... సొగసులను పొదువుతున్న నగ్నశరీరం బయటపడి,

చూపులు వేడెక్కుతున్నాయి.

మెదళ్ళు వేడెక్కుతున్నాయి – ఐదు గురు మగ కళాకారుల వశుమ నగ్నంగా ఆమె నిలబడి....,

"ఆ కాలు యిటు జరపండి కొద్దిగా పైకెత్తి"

జరిపింది.

"నవ్వాలి మీరు ... ముఖంలో కాస్త విరహం...."

అర్థమైందామెకు.

మూసిన గుప్పిట్లో విప్పు .... కాని ముఖంపై నవ్వు .... హ్హాహ్హాహ్హహ్హా

"రైట్...."

క్లిక్.... క్లిక్.... క్లిక్

ఒకడు కూర్చొని....ఒకడు నిలబడి.... మరోకడు నేలపై వెల్లికిలా పడుకుని.

కళాదృష్టితో రసస్పష్టి జరుగుతున్న పుడు నీచమైన, తుచ్ఛమైన, కామపరమైన ఆలోచనలు రాకూడదు .... రావు .... ఆమెకు.

కోరికలు అంటే కాటుల్లా కెమెరాల్లో.. మొదళ్ళలో.

కాని.... గుండెలో ఈ రైళ్ళేమిటి. కెమెరా లదురుతున్నాయి. చెమటలు కారుతున్నాయి. వర్షంలో చెమట. చెమటలో భయం, భయంలో సిగ్గుపడ్తూ లుంగలుపడ్తున్న మనిషితనం.

కాని....తప్పదు.

క్లిక్... క్లిక్.

ఆమె ప్రశాంతంగా.... ఆకాశంలా... సముద్రంలా.... ఒట్టి భూమిలా,

కొద్దిసేపు కొత్తదనం....దడదడ.... సిగ్గు....బిడియం... తర్వాత – మామూలు ....సాధారణం. ఏమీ అనిపించనితనం. శూన్యం....ఉత్త శూన్యం.

"మీరు సైడ్‌యాంగిల్‌లో ఇలా."

"..........." అలాగే,

కెమెరాలు వేగంగా పనిచేస్తున్నాయి.

కళావంతంగా, ఏమాత్రం అసభ్యం కాకుండా, కళాకారులుగా నే ఫోటోలు తీయాలని సమిష్టిగా అందరూ కలిసి అనుకున్న అందరు....

ఏమిటేమిటో తీస్తున్నారు.

ఎక్కడెక్కడో కెమెరా క్లిక్కుమంటోంది.

మెరుపులు శరీరాన్ని కప్పేస్తున్నాయి. తినేస్తున్నాయి... ఆక్రమించేస్తున్నాయి.

నిముషం.... రెండు నిముషాలు.... మూడు నిముషాలు.,

క్లిక్‌లు ఆగడంలేదు....తెగడంలేదు.

—— పదిహేను నిముషాలు.

రోల్స్. తిరిగి....తిరిగి.


ప్రేళ్ళ ఒత్తడం జరిగి జరిగి.

కళ్ళు దాహంతో చిట్లి చిట్లి,

నిశ్శబ్దం....

ప్రళయానంతర నిశ్శబ్దం.

సిగరెట్లు వెలిగి....పొగలు క్రమ్మి... నిట్టూర్పులు బుసకొట్టి,



చీర సంధించాడు—ఎవడో.

ఆమె మౌనంగా అందరివంకా అర్థహీనంగా చూచి, చీరనందుకుని.... తల వంచుకుని ఒంటిపై కప్పుకు....,

• • •

“ప్రతిరాత్రి ఎవడో ఒకడొస్తాడు. వాడూ బట్టలిడిపిస్తాడు. నగ్నంగా దగ్గరకు రమ్మంటాడు. పిసుకుతాడు. రక్కుతాడు. కొరుకుతాడు. ఇంతా చేసి ఓ నలభయ్యో, యాభయ్యో చేతిలో పెట్టి ఉడాయిస్తాడు. వీళ్ళు పాపం ఒట్టి బట్టలిడిపించి కనీసం ఒంటిని తాకనైనా తాకకుండా. మర్యాదగా రెండొందలరూపాయలిచ్చారు. మంచోళ్ళు.... పుణ్యాత్ములు పాపం...”

ఆమె మనసు వర్షిస్తోంది-కన్నీళ్ళమం

వర్షంలో ఆమె కూర్చున్న రిక్షా కిర్రుకిర్రున నడుస్తోంది గతుకులరోడ్డుపై నుండి-

సరిగ్గా ఆ సమయానికి_

బీర్ పీసాలు ముందుపెట్టుకుని చికెన్ ముక్కలు నములుతూ ఆమె ఫోటోతో గోల్డుమెడల్ సంపాదించబోయే ఓ ఫోటోగ్రాఫర్ నోరు - “దాన్నేమన్నా ముట్టుకున్నామా పట్టుకున్నామా... రెండొందలు దొబ్బిపోయింది దొంగలంజ ....” అంటోంది.

వర్షం కురుస్తూనే వుంది ఆకాశం ఏడుస్తున్నట్టు.

